క్లుప్తంగా

యోగానందుని సన్నిధిలో పూజలు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర ఓబీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హైదరాబాద్ జగద్గిరిగుట్టలో స్థిరపడిన నాయకుడు జిల్ల కనక శేఖర్‌యాదవ్ ఆదివారం శ్రీ యోగానంద లక్ష్మీనర్సింహా స్వామిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. పుట్టిపెరిగిన గ్రామంలోని ఆలయాలకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం ముదిరాజ్ కులపెద్దలు శాలువాలతో సన్మానించారు. బీజేవైఎం నాయకులు జ్యోతిబసు, జెల్లసుమంత్, నరసింహయాదవ్, బొజ్జ కనుకయ్య ఉన్నారు.

టెలికాన్ఫరెన్స్‌లో సింగిల్‌విండో చైర్మన్లు

సుల్తానాబాద్: సహకార సంఘాలు బ్యాంకులకు దీటుగా పనిచేసేందుకు కాన్ఫరెన్స్ తోడ్పడుతుందని మంత్రులు వివరించినట్లు కెడీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్ తెలిపారు. ఢిల్లీలో ఆదివారం ముగింపు సమావేశంలో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా, మంత్రి బన్సల్‌లాల్ సహకార సంఘాలపై వివరించినట్లు తెలిపారు. రైతుల కోసం అనేక సంక్షేమపథకాలు సీఎం కేసీఆర్ పెట్టారని ఈ సందర్భంగా టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ తెలిపారన్నారు. ఆయనవెంట సింగిల్‌విండో చైర్మన్ మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

గోదావరిఖని: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కేంద్రప్రభుత్వం ముందుకు సాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ పేర్కొన్నారు. స్థానిక జీఎం కాలనీలోని శక్తికేంద్రంలో మహాజన్ సంపర్క్ అభియాన్ ఇంటింటికీ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంచి ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. నాయకులు మామిడి రాజేశ్, వడ్డేపల్లి సదానందం, సంపత్, పి.మల్లికార్జున్, సోమారపు లావణ్య, పిడుగు కృష్ణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ కోరారు. ఆదివారం పట్టణంలోని పూసాల శాస్త్రీనగర్‌లో జేసీబీలతో పిచ్చిమొక్కలు తొలగించారు. ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు పెరగకుండా చూసుకోవల్సిన బాధ్యత యజమానులపై ఉందన్నారు. నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత కౌన్సిలర్లు గుర్రాల శ్రీనివాస్, రేవెల్లి తిరుపతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయంలో బోనాల పండుగ



బోనాలతో తరలివెళ్తున్న భక్తులు

ధర్మారం: మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామశివారులోని దుర్గామాత ఆలయంలో ఆదివారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారం గ్రామం నుంచి భక్తులు బోనాలతో తరలివెళ్లి ఆలయంలో బోనాలు సమర్పించారు. అనంతరం ఆలయ పూజారి మూర్తి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఎర్రగుంటపల్లి సర్పంచు కొత్తలక్ష్మి, మాజీ ఎంపీటీసీ పాలకుర్తి రేణుకదేవి, నూతి విజయలక్ష్మి భక్తులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని ఆలయాల్లో జలాభిషేకాలు



ఆలయాల్లో జలాభిషేకం చేస్తున్న రైతులు

జూలపల్లి: వర్షాలు కురవాలని రెతులు మండలకేంద్రంలోని ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు,జలాభిషేకాలు నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంతో పాటు వేణుగోపాలస్వామి, రావుల మల్లన్న ఆలయంలో, శ్రీభక్త మార్కడేయ స్వామి ఆలయంలో, శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం, పోచమ్మతల్లి ఆలయాల్లో జలాభిషేకం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్సింహ యాదవ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షాలు చాలా ఆలస్యంగా వచ్చాయని రైతులు విత్తనాలు వేయక పోగా ఆదను దాటుతోందని ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొప్పుల మహేశ్, మాజీ సర్పంచ్ మల్లేశం, లోక రవీందర్‌రెడ్డి, కొమురయ్య, కొమ్మ ఐలయ్య, రైతులు పాల్గొన్నారు.

సౌకర్యాల ఒడి.. మన ఒడి

- మన ఊరు–మన బడితో డిజిటల్ పాఠాలు, సకల సౌకర్యాలు
- 2020, 2021లో 'పది' ఫలితాల్లో వందశాంత ఉత్తీర్ణత
- జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా గర్రెపల్లి జెడ్పీహెచ్ఎస్



డిజిటల్ ద్వారా విద్యాబోధన

సుల్తానాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిధులు సమాకూర్చి అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగానే సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా సకల సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం 214 విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ మంచి ఫలితాలు తీసుకువస్తున్నారు. విద్యార్థులకు క్రీడల్లో, యోగాపై శిక్షణ ఇస్తున్నారు. దీంతో జిల్లాలోనే గర్రెపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది.

నేటికీ విద్యార్థులతో కలకల..

గర్రెపల్లి గ్రామంలోనే గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, మహాత్మాజ్యోతిబాపూలే గురుకులం పాఠశాలలు ఉన్నా గర్రెపల్లి పాఠశాలలో 214మంది విద్యార్థులు ఉన్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

మన ఊరు–మనబడితో సకల సౌకర్యాలు..



యోగా శిక్షణలో విద్యార్థులు

ప్రభుత్వం చేపట్టిన మన ఊరు–మన బడి కార్యక్రమం, పూర్వ విద్యార్థుల సహాయ సహకారంతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా సౌకర్యాలు కల్పించారు. విద్యార్థుల కోసం విశాలమైన డైనింగ్ హాల్, తాగునీటి వసతి, బాలబాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, పెయింటింగ్ రూం, గ్రీన్ చాక్ బోర్డు, డిజిటల్ బోధన, ఐఎఫ్ఎల్ టీవీలు అందుబాటులో ఉన్నాయి. అంతేగాక విశాలమైన క్రీడా ప్రాంగణం ఉంది. ఈ పాఠశాల విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌లో ఏటా ఎంపిక కావడం విశేషం.



విశాలమైన డైనింగ్ హాల్

గత ఆరేళ్లలో పదిలో ఫలితాలు..

గర్రెపల్లి జెడ్పీ హైస్కూలు పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఇలా ఉంది. 2018లో 84శాతం, 2019లో 92శాతం, 2020లో 100శాతం, 2021లో 100శాతం, 2022లో 87శాతం, 2023లో 78శాతం ఉత్తీర్ణత సాధించారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన



విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా డిజిటల్ పాఠాలతో విద్యబోధన చేయడం జరుగుతుంది. పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంతో పాటు ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– మాధవిలత, హెచ్ఎం

ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ



నాణ్యమైన విద్యతో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోనే పిల్లలను పాఠశాలకు పంపిస్తున్నాం. వి ద్యార్థుల చదువుపై ఎప్పటికప్పుడు పిల్లల తల్లిదండ్రులకు సమాచారం అందిస్తున్నారు.

– జెట్టి సంపత్, ఎస్ఎంసీ చైర్మన్

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవైఎల్ నాయకులు

జ్యోతినగర్: ప్రజావ్యతిరేక విధానాలపై యువత ఉద్యమించాలని ప్రగతి శీల యువజన సంఘం(పీవైఎల్)ఎన్డీపీసీ పట్టణ కార్యదర్శి దండు రమేశ్ స్పష్టం చేశారు. ఆదివారం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. నిరుద్యోగంతో పల్లెలు వీడి పట్టణాలకు వలస వెళ్తున్నారన్నారు. పనులు లేక ఉద్యోగాలు లేక ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టేందుకు నిరుద్యోగ యువత పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహాసభలో గత పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యాచరణకు మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 4,5 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు పట్టణంలో పీవైఎల్ 8వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. నిరుద్యోగ, యువత మహాసభలకు కదలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు గొట్టె శంకర్, మనోజ్, మహేందర్, శ్రీనివాస్, సంజీవ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న హరీశ్‌గౌడ్

పాలకుర్తి: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళుతూ, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని జనసేన పార్టీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి మూల హరీశ్‌గౌడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం పాలకుర్తి మండలకేంద్రంలో పార్టీ నియోజకవర్గ ముఖ్యనాయకుల ఆత్మీయ సమావేశానికి హాజరైన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ రామగుండం నియోజకవర్గం నుంచి పోటీచేస్తుందని, ఇందుకు సంబంధించిన కార్యచరణ చేపడుతున్నామన్నారు. అన్ని మండలాల్లో కార్యాలయాలు, గ్రామాల్లో పార్టీ జెండా గద్దెల నిర్మాణం, బూత్‌స్థాయి కమిటీల ఏర్పాటుదిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రతీ కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. పాలకుర్తి మండల అధ్యక్షుడు బూస శ్రీనివాస్ యాదవ్, బోదాసు అశోక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు రావుల మధు, చల్లా శివారెడ్డి, మేకల రాజ్‌కుమార్, గోపికృష్ణ, మంథని శ్రావణ్, రవికాంత్, సాయి, మేకల సంతోష్, పుప్పాల సతీశ్, మహేందర్, మంగ వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కటికెనపల్లిలో ఉచిత మెగా వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న స్నేహలత, కరుణశ్రీ

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి గ్రామంలో మెడికవర్ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా వైద్యశిబిరాన్ని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి, కొప్పుల ట్రస్టు చైర్మన్ కొప్పుల స్నేహలత, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ ప్రారంభించారు. రోగులకు ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ స్నేహలత, ఎంపీపీ కరుణశ్రీ మాట్లాడుతూ.. ఈ శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులకు వి విధరకాల పరీక్షలు చేసినట్లు తెలిపారు. శిబిరంలో 200 మందికి ఈసీజీ, బీపీ, షుగర్, టూఈ ఈకో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు కారుపాకల రాజయ్య, ఎంపీటీసీ సూరమల్ల శ్రీనివాస్, గుజ్జేటి కనకలక్ష్మి, వైద్యులు వేణుగోపాల్, ప్రవీణ్, దాసరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లకు మగువ లయన్స్ సన్మానం



సన్మానిస్తున్న మగువ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో శనివారం రాత్రి జాతీయ వైద్యుల దినోత్సవాన్ని స్థానిక కల్యాణ్ నగర్‌లో మగువ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీవాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరోనా సమయంలో మృతిచెందిన స్థానిక వైద్యులు డాక్టర్ రాజం, డాక్టర్ భూమారెడ్డి తదితరులకు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం రామగుండం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు, రామగుండం మేయర్ డాక్టర్ అనిల్ కుమార్‌తోపాటు డాక్టర్లు నిరంజన్, సుదర్శన్, సురేంద్ర నెహ్రూ, దయానంద్‌గాంధీ, వెంకటేశ్వర్లు, క్యాస శ్రీనివాస్, కంది శ్రీనివాస్‌రెడ్డి, కేటీకేవై లక్ష్మీవాణి, అనిల్‌కుమార్ దంపతులు, వనజా రాపోల్, సంక్షేమరెడ్డితో పాటు పోస్ట్‌మాస్టర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మగువ సభ్యులు బీనా, సుష్మా, పద్మ, భాగ్యలక్ష్మి, అనిత, జ్యోతి, సంతోష, భవానీ, సద్గుణ, లక్ష్మీ, సీనియర్ రామగుండం లయన్స్‌క్లబ్ సభ్యులు బంక రామస్వామి, తిలక్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

మంథని: మండలంలోని బొక్కలవాగుపై పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ ఈనెల 4న నిర్వహిస్తున్నట్లు విగ్రహావిష్కరణ కమిటీ చైర్మన్ పర్స బక్కయ్య తెలిపారు. ఆదివారం మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు తగరం శంకర్‌లాల్, కనవేన శ్రీనివాస్, పిక్కల రాజయ్య, ఏట రవి, గొర్రెంకల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

జనగర్జనకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



ఖమ్మం సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

సుల్తానాబాద్: ఖమ్మంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే జనగర్జన సభకు స్వచ్ఛందంగా తరలిన సుల్తానాబాద్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు 12వ వార్డు కౌన్సిలర్ దున్నపోతుల రాజయ్య మాట్లాడుతూ... రానున్న కాలంలో రాష్ట్రంలో కాంగ్రెస్ 100 అసెంబ్లీ స్థానాల్లో గెలిచి గొల్కొండ కోటపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఖమ్మం సభకు తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుమార్‌కిషోర్, చింతల రాజు ఎండీ.రఫీక్, నోముల శ్రీనివాసరెడ్డి, వేగోళం శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు: ఖమ్మంలో ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనగర్జన సభకు ఎలిగేడు మండలం నుంచి ముఖ్యనేతలు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచులు అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, సింగిరెడ్డి ఎల్లవ్వ, దుగ్యాల శ్వేత, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, నాయకులు రాజేశ్వర్ రెడ్డి,అమ్ముల శ్రీనివాస్, ఉన్నారు.

బీఎస్పీలో పలువురి చేరిక



యువతను అభినందిస్తున్న నాయకులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ఇందిరానగర్ యూత్ సభ్యులు ఆదివారం బీఎస్పీలో చేరారు. ఇందిరానగర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు దేవునూరి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో 25మంది ఇందిరానగర్ యూత్ సభ్యులు బీఎస్పీలో చేరారు. బీఎస్పీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్, యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కాసిపేట స్వామి, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పొన్నాల శ్రీనివాస్, జనగామ మల్లేశ్, జనంపల్లి శ్రీనివాస్, అంతడుపుల రాజేందర్, రాచర్ల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద రక్తదానం



ఉద్యోగులను అభినందిస్తున్న అధికారులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ఎల్అండ్‌టీ సేఫ్టీడే సందర్భంగా శ్రీనగర్‌కాలనీలోని ఎల్అండ్‌టీ కంపెనీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 30 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఎల్అండ్‌టీ రామగుండం ఏరియా మేనేజర్ బి.లక్ష్మీమోహన్‌రెడ్డి, జేజే పాండియన్ రక్తదాతలను అభినందించారు. ఎల్అండ్‌టీ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. దాతలు స్వచ్ఛంద ంగా దానం చేసిన రక్తాన్ని తలసేమియా పిల్లలకు ఉపయోగించనున్నట్లు తెలిపారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం

కమాన్‌పూర్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటా బీజేపీ కార్యక్రమాన్ని ఆదివారం మండలకేంద్రంలోని రాంనగర్‌లో చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి బీజేపీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు జంగపెల్లి అజయ్, మట్ట రాజయ్య, మల్లారపు అరుణ్, మచ్చగిరి రాము, చిప్పకుర్తి సతీశ్, దాముక సందీప్, నవీన్ పాల్గొన్నారు.

సమయం సద్వినియోగం చేసుకోండి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న పుట్ట శైలజ

మంథని: ఖాళీ సమయాన్ని వృథాచేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ఇందుకు స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకోవాలని మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ మహిళలకు సూచించారు. ఆదివారం 2వ వార్డు మహిళలకు విస్తారాకుల తయారీపై అవగాహన కల్పించారు. ప్రతీ మహిళకు ఉపాధి కల్పించేందుకు ముందుకు సాగుతున్నామన్నారు. కూలీ పనులతో పాటు, విస్తారాకుల తయారీపై దృష్టిసారిస్తే అదనంగా ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు.

బీజేపీ నుంచే పోటీ చేస్తా

- ఆత్మీయ సమ్మేళనంలో కౌశిక హరి



మాట్లాడుతున్న కౌశిక హరి

రామగుండం: వచ్చే ఎన్నికల్లో బీజేపీ నుంచే పోటీచేస్తానని, అధిష్టానం ఆశీస్సులు తనపైనే ఉంటాయని భావిస్తున్నట్లు బీజేపీ నాయకుడు కౌశిక హరి అన్నారు. తన స్వగృహంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేశారు. 30 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలోనే ఉన్నానని, ప్రజలు, కార్మికుల కష్టాలు తనకు తెలుసునన్నారు. పారిశ్రామిక ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారని, వ్యాపారాలు తగ్గడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాలపేరుతో రాష్ట్రప్రభుత్వం ఖర్చుచేసిన లక్షలాది రూపాయలు పేదలకు పంచితే బావుండేదన్నారు. కార్మికుల కోసం ఎంతవరకైనా కొట్లాడుతానన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మహేవాది రామన్న, మూకిరి రాజు, మారం వెంకటేశ్, జమీల్, పున్నం శశికుమార్, తోడేటి రవికుమార్, గాలెంకి ప్రసాద్, నిమ్మరాజుల రవి, దారంగుల కుమార్, మద్దికుంట శంకర్, గోగుల రవీందర్‌రెడ్డి కార్మిక సంఘాల అభిమానులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ



రాజేంద్రప్రసాద్

గోదావరిఖని: ఉచితవృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ఆర్జీ–2 అధికార ప్రతినిధి తెలిపారు. 2023–24 సంవత్సరానికి గాను సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో టైలరింగ్,మగ్గం,బ్యూటీషియన్,ఫ్యాషన్‌డిజైనింగ్ కోర్సులు ప్రారంభిస్తున్నామన్నారు. నేర్చుకోవాలనే ఆసక్తి గల సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులు మహిళలు, పరిసర, ప్రభావిత గ్రామాల మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులతో పాటు విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డ్ జిరాక్స్, మూడు పాస్‌పోర్ట్ సైజ్‌ఫోటోలు జతచేసి జీఎం కార్యాలయంలో ఈనెల 15లోగా అందించాలన్నారు.

మండలస్థాయి ఎంపిక పోటీలు

పాలకుర్తి: రాష్ట్రస్థాయిలో స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశ పరీక్షకు పాలకుర్తి, అంతర్గాం మండల స్థాయి ఎంపిక పోటీలు ఈనెల 4న మంగళవారం ఎన్టీపీసీ జెడ్పీపాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సంపత్‌రావు ఆదివారం తెలిపారు. నాలుగో తరగతిలో ప్రవేశాలకు మూడో తరగతి పూర్తిచేసి సెప్టెంబర్ 1, 2014 నుంచి ఆగస్టు 31, 2015 మధ్య పుట్టినవారు అర్హులని, 5వ తరగతిలో ప్రవేశాలకు నాలుగో తరగతి పూర్తిచేసి సెప్టెంబర్, 1, 2013 నుంచి ఆగస్టు 31, 2014 మధ్య పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే బాలబాలికలు విధిగా ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో వెంట తీసుకురావాలని సూచించారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు, జిల్లాస్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థులు స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశానికి అర్హులని, మండల స్థాయి పోటీల్లో పాల్గొనేవారు. మండల ఎస్జీఎఫ్‌సెక్రటరీ,పీఈటీ శోభారాణి (9866573426), సోమశేఖర్(8309978003)లను సంప్రదించాలని ఎంఈఓ కోరారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధిచెబుదాం



సబ్బితంలో ప్రచారం చేస్తున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి చేసిందేమిలేదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ దాసరి ఉష ఆరోపించారు. పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలో ఆదివారం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి బొట్టుపెట్టి సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. నియోజకవర్గంలో బీఎస్పీ రోజురోజుకు బలపడుతుండడాన్ని జీర్ణించుకోలేని కొందరు తమ పార్టీ కార్యకర్తలు, నాయకులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీ నాయకుల జోలికి వస్తే ఊరుకోబోమన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్, రియాజ్, అరుణ, ప్రశాంత్ తదితరులున్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గోదావరిఖనిటౌన్: స్థానిక సెక్రెడ్‌హార్ట్ హైస్కూల్‌లో 2003లో 7వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 20 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా స్కూల్ ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిస్టర్స్ పాల్గొన్నారు.